క్లుప్తంగా

మండల స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నేడు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఉదయం 9.30 గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) మండల స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల శాఖ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. బాలురు, బాలికల జట్లకు వేర్వేరుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


తులసీ పైడినాయుడు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన రాజాన తులసీ పైడినాయుడు అండర్–16 బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యార్థి తండ్రి వెంకటరావు మంగళవారం మీడియాకు తెలిపారు. వాడచీపురుపల్లి ముత్యమాంబ బాల్‌బాడ్మింటన్ క్లబ్ ద్వారా ఈ నెల 25న హర్యానాలో జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పైడినాయుడు బరిలో నిలవనున్నట్లు పేర్కొన్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం


వరద సహాయనిధికి విరాళం అందిస్తున్న లుపిన్ డీజీఎం హెచ్ఆర్ శ్రీనివాసరావు

పరవాడ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక జేఎన్ ఫార్మాలోని లుపిన్ పరిశ్రమ యాజమాన్యం రూ.2 లక్షలను సీఎం సహాయ నిధికి విరాళం అందించింది. ఈ మేరకు విరాళం చెక్కును జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డికి పరిశ్రమ డీజీఎం హెచ్ఆర్ శ్రీనివాసరావు మంగళవారం అందించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ జేవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.చిన్నారావు, లుపిన్ పరిశ్రమ ప్రతినిధి ఎస్.అప్పారావు, సేఫ్టీ మేనేజర్ కేదార్ మల్లా, డి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

మోక్షగుండం విగ్రహావిష్కరణ


మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తుమ్మిడి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సేవలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెచ్‌వోడీ కె.సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ దుకాణంలో చోరీ


దేశపాత్రునిపాలెంలో రైస్ షాపు షట్టర్‌ను పెకిలించిన దృశ్యం

పరవాడ: దేశపాత్రునిపాలెంలో గ్రామ సచివాలయం కింద శివసాయి ఎంటర్‌ప్రైజెస్ రైస్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఈ దొంగతనంలో కౌంటర్‌లో భద్రపర్చిన రూ.8 వేల నగదును దుండగులు దొంగిలించుకుపోయారు. సోమవారం రాత్రి షాపు మూసి, యజమాని ఇంటికి వెళ్లి పోయాడు. మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్ పెకిలించి ఉండటాన్ని గుర్తించాడు. లోపల కౌంటర్లో ఉంచిన రూ.8 వేలు నగదు అపహరించినట్లు పరవాడ పోలీసులకు దుకాణం యజమాని మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097



ఆగస్టు 18 ఆదివారం. సమయం వేకువజాము 3.30 గంటలు. పెందుర్తి నటరాజ్ థియేటర్‌కు ఆనుకుని ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను నిమిషాల వ్యవధిలో దుండగులు కొల్లగొట్టారు. రూ.19.50 లక్షలు దోచుకుపోయారు. నేరం జరిగిన 9 గంటల తర్వాత గానీ పోలీసులు అక్కడికి చేరుకోలేదు. తర్వాత ఉన్నతాధికారులు రావడం.. మిగిలిన తతంగం షరా మామూలే..!



ఆగస్టు 19 సోమవారం వేకువజామున పెందుర్తి రైల్వే స్టేషన్ దారిలోని కాలనీలో వరుసగా మూడు ఇళ్లలో దొంగలు పడ్డారు. బీరువాల్లో దాచుకున్న 17 తులాల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కిలోల వెండి వస్తువులు ఎత్తుకుపోయారు. నేరం జరిగిన తర్వాత సమాచారం అందుకుని వచ్చిన పోలీసులు యథావిధిగా కేసులు నమోదు చేశారు. విచారణ జరుపుతున్నారు.

- పెందుర్తి ప్రాంతంలో వరుస **దోపిడీలు**
- నేరం జరిగాక తప్ప కానరాని క్రైం అధికారులు
- భయాందోళనలకు గురవుతు**న్న జనం**

శివారులో చోరీలు.. ఖాకీల బేజారు


దువ్వపాలెంలో మహిళ మెడలో పుస్తెలతాడు తెంచుకుపోయి, సీసీ కెమెరాకు చిక్కిన దుండగుడు

నాలుగేళ్లలో పెందుర్తిలో చోరీలు

సంవత్సరం	ఇళ్లలో	చైన్ స్నాచింగ్
2021	10	05
2022	15	04
2023	10	06
2024	20	03



పెందుర్తి: తాజాగా పెందుర్తి కూడలికి కూతవేటు దూరంలో ఉన్న ఎలక్ట్రికల్, మోటార్ల దుకాణాలను దుండగులు షట్టర్లు తెరిచి దాదాపు రూ.2 లక్షల విలువైన సామాగ్రిని ఎత్తుకుపోయారు. ఇవన్నీ ఇటీవల పెందుర్తి శివారు ప్రాంతాల్లో జరిగిన దొంగతనాలు మాత్రమే..!

నియోజకవర్గ పరిధిలో దొంగలు పేట్రేగిపోతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో వరుస దొంగతనాలతో ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నా.. ఖాకీల్లో ఆ స్థాయి చలనం కనిపించట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీ జరిగాక ఒకటి రెండు రోజులు మాత్రమే పోలీసుల హడావుడి కనిపిస్తోంది. ఆ తర్వాత షరా మామూలే. ప్రజలకు నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన కల్పించడం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర జాగ్రత్తలపై క్రైం విభాగం అధికారులు పెద్దగా దృష్టి సారించట్లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో పెందుర్తి క్రైం విభాగానికి ప్రత్యేకంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉండేవారు. ప్రస్తుతం పెందుర్తి క్రైం విభాగానికి వెస్ట్ జోన్ సర్కిల్ అజమాయిషీ కావడంతో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పూర్తిస్థాయిలో దృష్టి సారించడం సాధ్యం కావట్లేదు. మరోవైపు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎవరికీ అందుబాటులో ఉండని పరిస్థితి. దీంతో నిత్యం ఏదో ఓ చోట అలజడి రేపుతూ దొంగలు తమ ఉనికిని చాటుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇళ్లను లూటీ చేయడం, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. నెల రోజుల వ్యవధిలో నేరాల సంఖ్య మరింతగా పెరిగిపోయింది.

ఎంతో రద్దీగా ఉండే పెందుర్తి కూడలికి సమీపంలోని ఏటీఎంను కొల్లగొట్టడంతో ప్రజలతో పాటు పోలీసులు సైతం అవాక్కయ్యారు. అది జరిగి 24 గంటల గడవక ముందే పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు దాదాపు కిలో మీటరు దూరంలో ఉన్న జనచైతన్య లేఅవుట్ గణేష్‌నగర్‌లో ఏకకాలంలో మూడిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. తాజాగా పట్టపగలే దువ్వపాలెం గ్రామంలో మహిళ మెడలో పుస్తెలతాడు దుండగుడు తెంచుకుపోయిన తీరుతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పెందుర్తి సర్కిల్ పరిధిలో అధికారులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలా చూడాలని కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో గస్తీ



పెందుర్తి ప్రాంతంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. దొంగతనాలు రాత్రి, పగలు కూడా జరుగుతున్నందున విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలి. అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలు నగలు జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రజలు ఊరు వెళ్లినపుడు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి. అపరిచిత వ్యక్తుల సమాచారం కోసం 1090, 100, క్రైం సీఐ: 94409 04717, క్రైం ఎస్ఐ: 83310 41618, పీఎస్: 0891–2764233 నంబర్లలో సంప్రదించవచ్చు.

– ఎస్.శ్రీనివాసరావు, సీఐ, వెస్ట్ జోన్ క్రైం విభాగం

ఘనంగా గణేష్ నిమజ్జనం


మల్లునాయుడుపాలెంలో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో సిద్ధి వినాయక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆరాధ్యుల సీతారామాంజనేయశాస్త్రి, ఆరాధ్యుల ప్రణయ్ శర్మ నిత్యం శాస్త్రోక్తంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. నిమజ్జనోత్సవంలో భాగంగా కోలాటం, మేళతాళాలు, భజన కార్యక్రమాలతో విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు, సిద్ధి వినాయక సంక్షేమ సంఘం సభ్యులు సత్యవరపు శ్రీనివాసు, గాజుల వెంకటరావు, సిరపరపు శ్రీను, గండి గణేష్, సత్యవరపు రామారావు, సిరపరపు శ్రీను, దాసరి అంకుల్, ఆరిపాక మహేష్ పాల్గొన్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన


ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న ప్రముఖ ఇంద్రజాలకుడు రవిశంకర్

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సింహాచలం ప్రాంతానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలకుడు రవిశంకర్ పలు రకాల ప్రదర్శనలతో అలరించారు. గాల్లో నుంచి పువ్వులు, పావురాలను తీసుకురావడంతోపాటు, కళ్లుమూసి తెరిచేలోగా వస్తువుల్ని మాయం చేసి అబ్బురపరిచారు. కాలనీలోని చిన్నారులు, నివాసితులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శనని తిలకించారు. కాలనీ నివాసితులు నడింపల్లి రామరాజు, యశ్వంత్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వచ్ఛతా హీ సేవతో పరిసరాల పరిశుభ్రత


పెందుర్తి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


రాంపురం ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


పరవాడలో మానవహారం నిర్వహించిన దృశ్యం



స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి


వెన్నలపాలెంలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ

పెందుర్తి: పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు. పెందుర్తి మండల సమాఖ్య ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ–2024'కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యంపై ఎలాంటి అశ్రద్ధ వహించకుండా క్షేత్రస్థాయిలో యంత్రాంగం పనిచేయాలన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. మొక్కలు నాటారు. కాయగూరల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, ఎంపీడీవో వెంకటరావు, ఏసీ సత్యంనాయుడు, ఏపీఎంలు రమణ, వల్లయ్య, సీసీలు, వీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● స్థానిక రాంపురంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు, పంచాయతీ కార్యదర్శి పైడిరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, గ్రామంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరవాడ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం పరవాడ గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి, సంతబయలులో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా శిరీషరాణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో స్వచ్ఛత రన్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రభుత్వ, ప్రవేట్ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు గ్రామాల్లో పరిశుభ్రతపై శ్రమదానం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీటి ఆదా, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛతపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, వెలుగు ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా వెన్నలపాలెంలో నీరు, శుభ్రతపై విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, వీఆర్వో నీరజ, ఏఎన్ఎం లక్ష్మి, సచివాలయ, డ్వాక్రా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


గోడ పత్రికను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

పరవాడ: సెజ్ కార్మికులు, ప్రజల భద్రతపై సీపీఎం ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి పరవాడ వరకు చేపట్టిన రక్షణ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా నాయకులు వి.వి.రమణ కోరారు. రక్షణ యాత్రలో భాగంగా చేపట్టిన బైక్ యాత్ర వాల్ పోస్టరును స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16న ప్రారంభమైన బైక్ యాత్ర 20న అచ్యుతాపురం చేరుకుంటుందన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు అచ్యుతాపురంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రత కరువైందన్నారు. ఏ కంపెనీలో ఏం జరుగుతుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నిర్వాసితులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయకులు పి.మాణిక్యం, బంగారాజు, శ్రీసత్య పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికతను జోడించాలి

డీఈవో వెంకటలక్ష్మమ్మ


లంకెలపాలెం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: బోధనలో మెలకువలు, వినూత్న పద్ధతులు అవలంబిచడానికి పాఠశాలల సముదాయాలు దోహదపడతాయని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బోధనా రీతుల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, సాంకేతికతను వినియోగించుకొని బోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవడం, వాటికి అనుగుణంగా మానసిక స్థితిని మార్చుకోవడం తప్పనిసరన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు ఎన్.వి.ఆర్.మూర్తి, డి.శ్రీనివాసరావు, ఎల్.వెంకటరావు పాల్గొన్నారు. తర్వాత పాఠశాల సముదాయాన్ని స్పోర్ట్స్ కాంపెక్స్‌ను పరవాడ మండల విద్యాశాఖాధికారి గొంతిన సాయి శైలజ సందర్శించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ సందర్శన

ఇదే ఆవరణలో నిర్వహిస్తున్న క్రీడా సముదాయాన్ని డీఈవో వెంకటలక్ష్మమ్మ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఆటల్లో కొత్త నిబంధనలు వస్తున్నాయని, వాటిపై అవగాహన కల్పించుకోవడం కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ తప్పనిసరి అన్నారు. విద్యార్థుల క్రమశిక్షణతో నడిచేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అండగా ఉంటూ ముందుకు నడిపించే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు పి.లక్ష్మి తదతరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవ ప్రారంభం


అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధి స్టేషన్లు, రైల్వే కాలనీలు, ప్రాంగణాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు, డీఆర్‌ఎం కార్యాలయం వద్ద స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు(ఆపరేషన్స్) ,సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రవీణ్‌భట్, డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ నరేంద్రకుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలంలో కాకుండా రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మమత హెచ్చరించారు. సింహాచలం స్టేషన్ ఆవరణలో రాంగ్ పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చేవారు ఎవరినైనా దింపేందుకు వస్తే వెంటనే వెళ్లి పోవాలని సూచించారు. ప్రయాణికుల కోసం వచ్చేవారు అడ్డంగా వాహనాలు నిలిపి గంటల కొద్దీ వేచి ఉండరాదన్నారు. ఇలా వాహనాలు నిలిపిన వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ఉక్కునగరం: చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు జనరల్ ఆస్పత్రి సహకారంతో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. చిన్మయ మిషన్ వైద్య మండలి ప్రతినిధులు సబ్బవరం మండలం నంగినారపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్షలు చేయనున్నట్లు వైద్య మండలి ప్రతినిధులు జయంతి కుమార్, డాక్టర్ స్వరూప తెలిపారు.

కార్మికుడి సస్పెన్షన్ ఎత్తివేయాలి


గాజువాక ఆర్టీసీ డిపో వద్ద నినాదాలు చేస్తున్న ఎస్‌ఎంయూ నాయకులు శంకరరావు తదితరులు

మల్కాపురం: వాల్తేర్ డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికుడు రామారావును అన్యాయంగా సస్పెండ్ చేశారని, తక్షణమే ఆ సస్పెన్షన్ ఎత్తి వేయాలని గాజువాక ఆర్టీసీ డిపో ఎస్‌ఎంయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ నాయకులు,కార్యకర్తలు మంగళవారం మధ్యాహ్నం భోజనం విరామం సమ యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాల్తేర్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామారావును క్లర్క్‌గా ఉపయోగించుకుంటున్నార ని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకించిన పాపానికి ఆయన్ను వాల్తేర్ డిపో యాజమాన్యం అన్యాయంగా సస్పెండ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై ప్రశ్నించే హక్కు లేదా అని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్‌ఎంయూ రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు,జోనల్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎం.రావు, డివిజనల్ ప్రెసిడెంట్ వి.ఎస్.ఆర్.మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబింగ్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండి 45 సంవత్సరాల లోపువారు అర్హులని తెలిపారు. ప్లంబింగ్ కోర్సుకు 8వ తరగతి, ఎలక్ట్రికల్ పదో తరగతి పాసై ఉండాలన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666,8309003957 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com